పార్కింగ్ పరేషాన్

- బాన్సువాడ పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు
- రోడ్లను ఆక్రమించిన వ్యాపారులు
- చిరు వ్యాపారాలకు నిలయంగా పార్కింగ్ స్థలాలు
- ఆక్రమణలపై చర్యలు శూన్యం



బాన్సువాడ పట్టణంలో రోడ్డుపైనే నిలిపిన వాహనాలు

బాన్సువాడ: కామారెడ్డి జిల్లా కేంద్రం తర్వాత బాన్సువాడ పట్టణం వాణిజ్య, వ్యాపార ప్రాంతంగా అభివృద్ధి చెందుతోంది. అటు నిజామాబాద్, ఇటు కామారెడ్డి జిల్లా కేంద్రాలకు వెళ్లాలంటే బాన్సువాడ మీదుగానే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. నిత్యం వేలాది మంది ఇతర ప్రాంతాల వారు వచ్చిపోతుంటారు. పట్టణం విస్తరిస్తుండడంతో పాటు జనాభా, వాహనాల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఫలితంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ప్రధానంగా పట్టణంలో ప్రధాన రహదారి వెంట ఈ సమస్య తీవ్రంగా ఉంటోంది.బాన్సువాడ పట్టణంలో ఇరువైపులా 50 ఫీట్లకు రోడ్డును విస్తరించారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడొద్దనే ఉద్దేశంతో 50 ఫీట్లలోనే రెండు వైపులా డ్రెయినేజీని తర్వాత పాదచారులు నడిచేందుకు వీలుగా ఐదు ఫీట్లు వదిలి టైల్స్ వేశారు. టైల్స్‌ను అనుకుని వాహనాల పార్కింగ్‌కు మరో ఐదు ఫీట్లు మార్కింగ్ వేశారు. కానీ వాహనాల పార్కింగ్ కోసం వేసిన మార్కింగ్ దాటి చిరు వ్యాపారులు నడి రోడ్డుపైనే తోపుడు బండ్లు నిలిపి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. చిరు వ్యాపారుల వద్ద విక్రయాలు జరిపే ప్రజలు నడి రోడ్డుపై వాహనాలను నిలపడంతో ప్రధాన రహదారిపై ట్రాఫిక జామ్ అవుతోంది. ఫలితంగా పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సబ్‌రిజిస్టర్ కార్యాలయం, తాడ్కోల్ రోడ్డు, పాత బాన్సువాడకు వెళ్లే దారి, బస్టాండ్ ప్రాంతాలలో తీవ్రంగా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుంది. మున్సిపల్, పోలీసు అధికారుల మధ్య సమన్వయం కొరవడడంతో సమస్య జఠిలమవుతోంది. అధికారులు వెంటనే చర్యలు తీసుకొని పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని బాన్సువాడ పట్టణవాసులు కోరుతున్నారు.

చలాన్లు వేస్తున్నారు

బాన్సువాడ పట్టణంలో పార్కింగ్ స్థలాలు లేవు. పొలానికి మందు సంచిని తీసుకెళ్దామని బాన్సువాడకు వచ్చాను. వాహనం రోడ్డుపై ఉందని చలానా వేశారు. పనుల నిమిత్తం పట్టణానికి వస్తే రోడ్డుపై వాహనం పెట్టాల్సి వస్తోంది. పోలీసులు ట్రాఫిక్ నిబంధనల కింద చలాన్లు వేస్తున్నారు. ఫైన్ కట్టలేని పరిస్థితి ఉంది. పట్టణంలో పార్కింగ్ సమస్య తీర్చాల్సిన అవసరం ఉంది.

– సాయిలు, మద్దెల్‌చెరువు

ట్రాఫిక్‌పై దృష్టి సారిస్తాం

బాన్సువాడ పట్టణంలో రాకపోకలకు అంతరాయం లేకుండా, ట్రాఫిక్ సమస్యలను పరిగణంలోని తీసుకుంటాం. ఈ విషయంపై ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ట్రాఫిక్ నియంత్రణపై సంయుక్త పరిశీలన చేసి సమస్యను పరిష్కరిస్తాం.

– అశోక్, సీఐ, బాన్సువాడ పట్టణం

ఆక్రమణలు తొలగిస్తాం

పట్టణంలో రోడ్డుకు ఇరువైపులా నిబంధనలు పాటించని ఆక్రమణలను తొలగిస్తాం. అనుమతులు లేకుండా వ్యాపారాలు చేస్తే చర్యలు తీసుకుంటాం. నిజమైన ఉపాధి కోసం చూస్తున్న చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ వసతి కల్పించేందుకు ప్రయత్నిస్తాం.

– శ్రీహరి రాజు, మున్సిపల్ కమిషనర్, బాన్సువాడ

పలు గ్రామాల్లో వైద్య శిబిరాల ఏర్పాటు



సంగోజీపేటలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ఇమ్రాన్



చిన్నకొడప్గల్‌లో నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరం



ఎల్లారెడ్డి మండలం మత్తమాలలో..

తాడ్వాయి/ఎల్లారెడ్డిరూరల్/బాన్సువాడ రూరల్/పిట్లం/రాజంపేట: సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో గురువారం పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. తాడ్వాయి మండలం కాళోజీవాడి, ఎల్లారెడ్డి మండలం మత్తమాల, దేవునిపల్లి, ఎల్లారెడ్డి పట్టణంలోని ఎర్రమన్నుకుచ్చకాలనీ, బాన్సువాడ మండలం సంగోజీపేట, పిట్లం మండలం చిన్నకొడప్గల్, రాజంపేట మండలం శివాయిపల్లి గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

సీసీ రోడ్డు సమస్య పరిష్కారం



పెద్దకొడప్‌గల్(జుక్కల్): జగన్నాథ్‌పల్లి తండాలో 4 నెలల క్రితం సీసీ రోడ్డు పనులు తండాలోని రెండు వర్గాల భూతగాదాల వల్ల ఆగిపోయాయి. దీంతో సీసీ రోడ్డు సమస్య పరిష్కరించాలని తండావాసులు పలువురు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. స్పందించిన బాన్సువాడ డీఎల్‌పీవో వెంకట సత్యనారాయణ రెడ్డి, ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి గురువారం జగన్నాథ్‌పల్లి తండాకు చేరుకొని తండా పెద్దల సమక్షంలో విచారణ జరిపి ఇరు వర్గాలను ఒప్పించి అసంపూర్ణంగా ఉన్న సీసీ రోడ్డు పనులు పూర్తి చేయడానికి స్థలం ఇచ్చేందుకు ఒప్పించారు. త్వరలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం చేస్తారని బాన్సువాడ డీఎల్‌పీవో వెంకట సత్యనారాయణ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గిర్దావర్ అంజయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, నాయకులు చిప్ప మోహన్, నాగిరెడ్డి, శామప్ప పటేల్, మల్లప్ప పటేల్, సంజీవ్, బస్సీ తండా పెద్దలు పాల్గొన్నారు.

శబరిమాత ఆశ్రమంలో పూజలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శబరిమాత దివ్యసమాధి, ప్రతిమ, చిత్రపటాన్ని అందంగా అలంకరించి ప్రత్యేక పూజలను జరిపించారు. తాడ్వాయి నుంచే కాకుండా ఇతర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

పక్షం రోజులైనా ప్రయాణానికి ఇబ్బందులే..!

- ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డికి బస్సులు లేక ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- గాంధారి మీదుగా ప్రయాణానికి రెండు గంటల అదనపు సమయం



ఎల్లారెడ్డి బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి నియోజకవర్గంలో భారీ వర్షాల కారణంగా 15 రోజుల క్రితం వరదలు రావడంతో రవాణా వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో ఎల్లారెడ్డివాసులకు బాన్సువాడ, హైదరాబాద్, కామారెడ్డికి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. 15 రోజులైనా ఇంత వరకు కామారెడ్డికి నేరుగా బస్సులు నడవకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎల్లారెడ్డి మండలంలోని ఒడ్డెరకాలనీ, అడివిలింగాల గేట్ వద్ద గల వంతెన, లక్ష్మాపూర్ కొట్టాల్ మధ్య రోడ్డు కోతకు గురి కావడంతో పాటు లింగంపేట్ మండలంలోని లింగంపల్లిఖుర్దు వంతెన పూర్తిగా కుంగిపోవడంతో కామారెడ్డికి గత నెల 27 నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. 10 రోజుల అనంతరం కామారెడ్డి డిపోకు చెందిన బస్సులు కామారెడ్డి నుంచి గాంధారి మీదుగా ఎల్లారెడ్డికి రెండు బస్సులను నడిపారు. బస్సులు సమయానికి రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గంట ప్రయాణానికి 3 గంటల ప్రయాణం చేయడం ఇబ్బందిగా మారిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లింగంపల్లి వంతెన మీదుగా చిన్నచిన్న వాహనాలు మాత్రమే రాకపోకలు సాగించడంతో, భారీ వాహనాలకు అనుమతులు లేకపోవడంతో కామారెడ్డికి గాంధారి మీదుగా చుట్టు తిరిగి వెళ్లాల్సి వస్తున్నదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల అనంతరం ఎల్లారెడ్డి, అడివిలింగాల, కొట్టాల్ శివారులో కోతకు గురైన రోడ్డుకు మట్టి పోసి రాకపోకలు సాగించినప్పటికి లింగంపల్లి ఖుర్దు శివారులో గల వంతెన పూర్తిగా దెబ్బతినడంతో బస్సులు నడవక జనాలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి వంతెనను పరిశీలించారు. వంతెనకు డైవర్షన్ రోడ్డును ఏర్పాటు చేస్తే రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ఉంటాయని అంటున్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చాలా ఇబ్బందులు పడుతున్నాం

ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డికి పది రోజుల వరకు బస్సులు నడవలేదు. నాలుగు రోజుల నుంచి గాంధారి మీదుగా కామారెడ్డికి రెండు బస్సులు నడుపుతున్నారు. ఇవి ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. అదే విధంగా గాంధారి మీదుగా కామారెడ్డికి వెళ్లాలంటే 2 గంటల అదనపు సమయం పడుతోంది. దీంతో చాలా ఇబ్బందిగా ఉంది.

– అనిత, ఎల్లారెడ్డి

డైవర్షన్ రోడ్డు పనులు ప్రారంభించాం

లింగంపల్లిఖుర్దు వద్ద వంతెన కుంగిపోవడంతో భారీ వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. వంతెన పక్కనుంచి భారీ వాహనాల రాకపోకలకు సంబంధించి ఉన్నతాధికారులకు డైవర్షన్ రోడ్డుకు ప్రతిపాదనలు పంపడంతో డైవర్షన్ రోడ్డు ఏర్పాటుకు అనుమతి లభించింది. డైవర్షన్ రోడ్డు పనులను ప్రారంభించాం. పనులను త్వరితగతిన పూర్తి చేసి భారీ వాహనాల రాకపోకలను పునరుద్ధరిస్తాం.

– నారాయణ, డీఈ, ఆర్‌అండ్‌బీ, ఎల్లారెడ్డి

దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.50 వేలు ఇవ్వాలి

- మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్



సంతాయిపేట్‌లో పంటలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ. 50 వేల నష్టపరిహారం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ డిమాండ్ చేశారు. ఆయన గురువారం సంతాయిపేట్ శివారులో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వందలాది ఎకరాల పంట పొలాలలో ఇసుక మేటలు, మట్టి దిబ్బలు, రాళ్లు పేరుకు పోయాయన్నారు. రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. వారం గడిచినా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవ్వరూ ఇక్కడికి రాలేదని రైతులు మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట సింగిల్ విండో చైర్మన్ కపిల్‌రెడ్డి, నాయకులు సాయిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, తాజోద్దీన్, మంగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తదితరులున్నారు.

విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



ఎల్లారెడ్డి: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా నాయకులు బాలకిషన్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డిలో బీజేపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. తెలంగాణ విమోచన దినోత్సవంతో పాటు మోదీ జన్మదినోత్సవంలో భాగంగా ఇంటింటా మొక్కలను నాటాలని, రక్తదాన శిబిరాలను నిర్వహించాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు రాజేష్ తదితరులున్నారు.

ఏఐపై అధ్యాపకులకు అవగాహన

కామారెడ్డి అర్బన్: మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికత వినియోగించుకోవడమే డిజిటల్ తరగతుల లక్ష్యమని, దీనిలో భాగంగా కృతిమ మేధ(ఏఐ) ప్రధానమని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కె.విజయ్‌కుమార్ అన్నారు. కళాశాలలో గురువారం కృత్రిమ మేధ, ఐసీటీ టూల్స్‌పై అధ్యాపకులకు ఒక రోజు అవగాహన సదస్సు నిర్వహించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కృత్రిమ మేధలో గామా, నోట్‌బుక్ ఎల్ఎం, చాట్ జీపీటీ, ఏఐ గుగూల్ స్టూడియో జెమిని, ఇన్ వీడియో తదితర సాధనాలను బోధనలో ఎలా వినియోగించాలో వివరించారు. వైస్ ప్రిన్సిపల్ కె.కిష్టయ్య, సమన్వయకర్తలు పి.విశ్వప్రసాద్, ఎ.జయప్రకాష్, ఆకుల సుధాకర్, ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎవరో వస్తారు..ఏదో చేస్తారని ఎదురుచూడకుండా..

- శ్రమదానంతో చెరువు కట్టకు మరమ్మతులు



చెరువు కట్టకు మట్టి పోస్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిరూరల్: ఎవరో వస్తారని ఏదో చేస్తారని అని ఎదురు చూడకుండా గ్రామస్తులంతా ఏకమై చేయి చేయి కలిపి తెగిపోయిన చెరువు కట్టకు మట్టిని పోసి అందరికి ఆదర్శంగా నిలిచారు. ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఊర చెరువు 15 రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు వరదలు రావడంతో చెరువు కట్ట తెగిపోయి నీరంతా పోయింది. దీంతో 15 రోజులుగా ఎదురు చూసిన గ్రామస్తులు ఎవరూ రారని ఏమి చేయరని భావించి గ్రామంలో గుడికి సంబంధించి ఉన్న రూ.20 వేలతో జేసీబీ ద్వారా కొంత పని చేయగా ఆ డబ్బులు సరిపోకపోవడంతో గ్రామస్తులంతా ఏకమై ఇంటికొకరు వచ్చి చెరువు కట్టకు మట్టిని పోశారు. వర్షాలు కురుస్తుండడంతో చెరువులోకి వచ్చిన నీరు పోతుందని భావించి పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకున్నారు. గ్రామస్తులంతా ఏకమై చెరువు కట్టకు మట్టిని పోయడంతో పాటు బుంగలను సైతం పూడ్చి వేశారు. చెరువు కట్ట కోసం శ్రమదానం చేసిన తిమ్మాపూర్ రైతులు అందరికి ఆదర్శంగా నిలిచారు.

కాలానికనుగుణంగా మెలకువలు నేర్చుకోవాలి



భిక్కనూరు: మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు మెలకువలను నేర్చుకోవాలని పెద్దమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం ప్రసూన అన్నారు. గురువారం భిక్కనూరు, బీబీపేట, దోమకొండ మండలాల ఇంగ్లీష్ ఉపాధ్యాయుల కాంప్లెక్సు సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలన్నారు. రిసోర్సు పర్సన్ అనిల్‌కుమార్, సీఆర్‌పీ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి టీఎల్ఎం మేళా



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట మోడల్‌స్కూల్‌లో గురువారం మండలస్థాయి టీఎల్ఎం మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు బోధనాభ్యసన సామగ్రి(టీఎల్ఎం)తో తయారుచేసిన స్టాళ్లను మేళాలో ప్రదర్శించారు. ప్రతి సబ్జెక్టుకు ఇద్దరు ఉపాధ్యాయుల చొప్పున 10 మందిని జిల్లాస్థాయి టీఎల్ఎం మేళాకు ఎంపిక చేసినట్లు నాగిరెడ్డిపేట ఎంఈవో భాస్కర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ప్రతి పాఠశాలలో లైబ్రరీ నిర్వహణ కోసం 7 పుస్తకాల చొప్పున 350 పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు.

విద్యార్థులు బోధన అలవాటు చేసుకోవాలి



బాన్సువాడ: విద్యార్థులు ఇప్పటి నుంచే బోధించే తత్వం పెంపొందించుకోవాలని జిల్లా నోడల్ అధికారి సలాం అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినం పురస్కరించుకుని గురువారం బీర్కూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు అధ్యాపకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో అన్నింటి కన్నా ఉత్తమమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని కొనియాడారు. భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మోహన్ రెడ్డి, అధ్యాపకులు యాదగౌడ్, సత్తన్న, రంజిత్, దేవిసింగ్, నారాగౌడ్, సౌమ్య, సతీష్, బాలకిషన్, రాకేష్ తదితరులున్నారు.

పాఠశాలల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల పూర్తి వివరాలను ప్రతి రోజు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఎంఈవో రామస్వామి అన్నారు. తాడ్వాయి ఉన్నత పాఠశాలలో గురువారం అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా, గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ప్రతిరోజు వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. స్వచ్ఛ విద్యాలయాలకు సంబంధించిన 60 ప్రశ్నలకు సమాధానాలు నింపాలని సూచించారు. పాఠశాలలో ఉన్న వికలాంగుల విద్యార్థుల వివరాలను ప్రశస్త యాప్‌లో పూర్తి చేయాలన్నారు. కాంప్లెక్స్ హెచ్ఎం కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొత్త రేషన్ కార్డుల పంపిణీ



మాచారెడ్డి: బంజపల్లిలో గురువారం కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నౌసీలాల్ ఆధ్వర్యంలో కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నౌసీలాల్ మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని ఆరోపించారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు వస్తాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, సన్న రేషన్‌బియ్యం అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. నాయకులు గణేశ్‌నాయక్, సంజీవ్‌కుమార్, నారాగౌడ్, రవి, బోజ్యానాయక్, శంకర్, మోహన్,రమేశ్‌రెడ్డి, రాజు ఉన్నారు.

స.హ.చట్టంపై అవగాహన



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మైనార్టీ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం డైరెక్టర్ సలీం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం అవినీతిని వెలికి తీయడానికి వజ్రాయుధం వంటిదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో జరుగుతున్న దోపిడీని ప్రభుత్వ అధికారులు చేస్తున్న అక్రమాలను వెలికి తీయవచ్చన్నారు. జిల్లా న్యాయ సలహాదారు, స.హ. పరిరక్షణ కమిటీ న్యాయవాది నరసింహాచారి, మదర్ పాష, ప్రభాకర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలో యూరియా కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతు సంఘం నాయకులు గురువారం ఆర్డీవో పార్థసింహారెడ్డికి వినతిపత్రం అందించారు. పంటలకు సకాలంలో యూరియా అందకపోతే ఎదుగుదల ఉండదని.. దీనిని దృష్టిలో ఉంచుకుని యూరియా సకాలంలో సరఫరా అయ్యేలా చూడాలని రైతు సంఘం నాయకులు మోతీరాం కోరారు.

పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



ఎల్లారెడ్డి: పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆర్డీవో పార్థసింహారెడ్డి అన్నారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణంలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలోని స్టోర్ రూం, డార్మెంటరీ, వాష్‌రూంలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రఫత్, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

వాహనాల అంగట్లో పోలీసుల తనిఖీలు



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని చర్చి గ్రౌండ్‌లో ప్రతి వారం జరిగే వాహనాల అంగడిలో ద్విచక్ర వాహనాల క్రయవిక్రయాలు జరుగుతాయి. ఇందులో భాగంగా ఈ గురువారం జరిగిన అంగట్లో పట్టణ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. విక్రయాలకు సిద్ధం చేసి ఉంచిన అన్ని వాహనాల రిజిస్ట్రేషన్, ఇతర పత్రాలను పరిశీలించారు. నిబంధనల ప్రకారం అన్ని పత్రాలు సక్రమంగా ఉండాలని పట్టణ ట్రాఫిక్ ఎస్సై మహేష్ నిర్వాహకులకు సూచించారు.

విధుల్లో చేరిన జీపీవోలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గ్రామ పరిపాలన అధికారులు(జీపీవోలు) గురువారం విధుల్లో చేరారు. నాగిరెడ్డిపేట మండలానికి 18మంది జీపీవోలను కేటాయించగా వారిలో 15 మంది విధుల్లో చేరారని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. ధర్మారెడ్డి, మాల్తుమ్మెద, చీనూర్ గ్రామాలకు చెందిన జీపీవోలు విధుల్లో ఇంకా చేరాల్సి ఉందని ఆయన వివరించారు.

సంక్షిప్తం

బీమా చెక్కు అందజేత

బాన్సువాడ రూరల్: తాడ్కోల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ధర్మని రుక్కవ్వకు మంజూరైన రూ.2 లక్షల ప్రమాదబీమా చెక్కును గురువారం చైర్మన్ గంగుల గంగారాం అందజేశారు. సంఘ సభ్యుడైన ధర్మని సాయిలు ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఇన్సూరెన్స్ మంజూరైందన్నారు. వైస్ చైర్మన్ మధుసూదన్, డైరెక్టర్లు రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ, గంగారాం, బాలరాజు, విఠల్, నగేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

లింగంపేట(ఎల్లారెడ్డి): అయిలాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో గురువారం డాక్టర్ క్రాంతికుమార్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు, సూచనలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు దామోదర్, ఉపాధ్యాయులు పద్మ, శివానంద్, లావణ్య, ఫార్మసిస్టు ఉమారాణి, ఏఎన్ఎం స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న మిత్రుడికి ఆర్థిక చేయూత

రాజంపేట: రాజంపేట మండల కేంద్రానికి చెందిన పందుల రమేష్ కామారెడ్డి జీఆర్ కాలనీ ప్రాంతంలో వీల్ అలైన్‌మెంట్ షాపును నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరద ధాటికి షాపులోకి నీరు చేరి వీల్ అలైన్‌మెంట్ మిషన్లు మొత్తం నీట మునిగాయి. దీంతో తీవ్రంగా నష్టపోయాడు. ఈ విషయం తెలుసుకున్న పదవ తరగతి మిత్రులు నవీన్, ఎం.స్వామి, ఆంద్యాల రవి రూ. 50 వేల ఆర్థిక సహాయాన్ని అందించి అండగా నిలిచారు. మిత్రులు తనకు అండగా నిలవడం పట్ల రమేష్ హర్షం వ్యక్తం చేశారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లు కూలిపోయి ఇబ్బందులు పడిన బాధితులకు గురువారం రామకృష్ణ మఠం తరఫున నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివాసరావు సమక్షంలో వరద బాధితులకు నిత్యావసర సరుకులను అందజేశారు. 25కిలోల బియ్యం బస్తాతోపాటు కారం, చింతపండు, చెంచాలు, బకెట్, బెడ్‌షీట్, బ్లాంకెట్ తదితర సరుకులను అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్, ఆర్ఐ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద ఇన్ఫోసిస్ ఆధ్వర్యంలో..



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివేకానంద ఇన్ఫోసిస్ ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు వంశీ, ముత్యపు సుమంత్, వల్లాల కృష్ణ, వేదాంతం రామకృష్ణ, మఠం రవి తదితరులు పాల్గొన్నారు.